# మనసు-మమత

ఆఫీసుకి వెళుతూ అన్నయ్య అన్నమాట దీప మనసులో కోటివీణలు మీటింది. ఆమెకళ్లముందు మల్లెల వాన కురిపించింది. మరుక్షణంనించీ ఊహాలోకాలలో తేలిపోతోంది. అన్నయ్య అన్న మాటే మరీ....మరీ.... మననం చేసుకుంది. దీపకు మధ్యాహ్నం వేళ ఏవో పుస్తకాలు చదువుకుంటూ అలాకాస్త కునుకుతీసే అలవాటు. కానీ....ఈ రోజు అలాచేస్తే సమయం వ్యర్థమైపోతుంది అనుకుంది. ఆ సమయాన్ని సాయంత్రంకోసం కాఫీ, టిఫిన్లు చేయడానికి



3)

వినియోగించింది. అప్పటికీ అమ్మ, వదిన ఇంకా నిద్రపోతూంటే కూరగాయలు ముందేసుకుని తరగడానికి కూర్చుంది. అప్పుడే కళ్లు నలుముకుంటూ వంట గదిలోకొచ్చిన ప్రభ ఆడపడుచును చూసి ఆశ్చర్యపోయింది.

"అదేమిటి దీపా! అప్పుడే వంట ప్రయత్నంలో పడ్డావ్! ఇవాళ నిద్రపోలేదా ఏమిటి?" అంది.

"లేదొదినా సాయంత్రానికి కాఫీ, టిఫిన్ కూడా చేసేశాను. ఇక ఈ వంట అయిపోతే మనకసలు పనేఉండదు" ఉత్సాహంగా అంది.

పోనీలే దీప వంటపని కూడా చేసేస్తోంది. రక్షించింది. ఇక తను తొందరగాకూడా తెమిలిపోవచ్చు అనుకుంటూ ప్రభ బాత్‌రూం వైపు నడిచింది. కోడలువెంటే తనూలేచి వచ్చిన కాంతమ్మ కూడా కూతుర్ని అలాగే ప్రశ్నించిది.

"అదేమిటి! ఇంతత్వరగా వంట చేసేస్తున్నావ్?"

"కాఫీ టిఫిన్ చేయడం పూర్తయిపోయింది. తొందరగా పనులన్నీ తెమిల్చేద్దామని" తరిగిన ముక్కలు మూకుట్లోవేస్తూ బదులిచ్చింది దీప. దీప వంటపని ముగించి తనూ తయారైంది. తన పుట్టినరోజుకి అన్నయ్య బహుమతిగా ఇచ్చిన లంగా,ఓణి వేసుకుంది. ఈ లంగాఓణి వేసుకుంటే నువ్వు ఎంతబాగుంటావోనే చెల్లెమ్మా! తను ఎప్పుడూ ఈ డ్రెస్ వేసుకున్నా ఆ మాట అంటాడు అన్నయ్య. అందుకే అన్నయ్యకిష్టమైన డ్రెస్‌లోనే తయారైంది. బైటవసారాలో భర్తరాకకోసం ఎదురుచూస్తూ మల్లెపూల మాల అల్లుకుంటోంది ప్రభ. ముస్తాబైఉన్న ఆడపడుచును చూసి ఒక్క క్షణం ఉలిక్కిపడింది ప్రభ.

ఈ అమ్మాయి ఎటు బయల్దేరుతున్నట్లు? కొంపదీసి తనతోనే రాదుకదా అనుకుంది. "ఇవిగో దీపా పువ్వులు." అల్లినమాల అక్కడికి తెంపేసి ఆప్యాయంగా అందించింది. "ఈ మాలనువ్వే పెట్టేసుకో వదినా! ఆ పూలు ఇటివ్వు. నేనల్లుకుంటా మాల." మీ అన్నయ్య రావడానికి టైం ఉందిగా. అందాకా నేనే అల్లుకుంటూ కూర్చుంటా. నువ్వెటూబయల్దేరుతున్నావ్. చీకటి పడకుండా త్వరగావెళ్లొచ్చెయ్. అలస్యమైతే అత్తయ్య కంగారుపడతారు." ఆ తరువాత వదిన ఏమన్నది విన్పించలేదు దీపకు. ఆమె హృదయానికి మ్రోగుతున్న కోటి వీణాతంత్రులు ఒక్కసారిగా తెగిన శబ్దం. ఆ రణగొణ ధ్వని ఆమె చెవుల్లో గింగురు మంటున్నాయ్.

"అదేమిటొదినా అన్నయ్య సినిమాకు వెళదామన్నాడుగా" దీప స్వరం గద్గదికంగా పలికింది. ఇంతవరకు తన మనసును ఏ తీయని మాట గిలిగింతలు పెట్టిందో, ఇంటిపనంతా అతి చురుగ్గా చేసేట్టుచేసిందో ఆమాటే ఇప్పుడు భారంగా వచ్చింది ఆమె నోట. దీప కళ్లతో పోటీ పడ్డానికి ఆ శరత్కాలపు సాయంత్రం ఆకాశంలో వర్షించబోయే మబ్బులు లేవు. ఇక అక్కడ నిలబడలేక దీప లోపలికి వెళ్ళిపోయింది. ఉదయంనించీ అంత హుషారుగా ఆదపడుచు ఎందుకు ఉన్నదీ చకచకా పనులన్నీ ఎందుకు చేసేసింది అర్థమవుతూనే ప్రభ మనస్సు చివుక్కుమంది. సినిమాకు వెళదామని అంటే దీప తననే అనుకుంది. అవును మరి రఘు మనిద్దరమే వెళదాం అనలేదుగా? దీప అనుకోవడంలో పొరపాటేం ఉంది. అయితే ఇప్పుడు దీపనుకూడా సినిమాకు తీసుకువెళ్లాలా? జంటగా తాము చూడబోయే తొలిసినిమా. ఇద్దరి మధ్యా దీప. 'ఛీ' తన ముచ్చట ఎలా తీరుతుంది. ఇన్నాళ్లకి రఘు తనకి తానే సినిమాకు

వెళదాం అన్నాడు. ఆ మాటే హనీమూన్‌కు వెళదాం అన్నంత హాయిగా అన్పించింది తన మనస్సుకు.

తను కాపురానికి వచ్చి నెల దాటినా ఎక్కడికీ వెళదాం అన లేదు రఘు. భర్తతో సరదాగా అలా తిరిగిరావాలని తను ఎంతగా ఉవ్విళ్ళూరినా ఆఫీసుపనిలో సతమతమౌతున్న రఘుని తనేమీ అడగలేక పోయింది. అలాంటిది ఈ రోజు 'సినిమాకు వెళదాం' అన్నమాట భర్తనోట వినేసరికి తనకు ఎంత సంతోషమనిపించిందో ఆ సంతోషాన్ని ఒక్క భర్తతోనే పంచుకోకుండా నేనూ ఉన్నా నంటూ ఆడబిడ్డ తనూ తయారైంది సినిమాకుకూడా జంటగా వెళ్ళే అదృష్టం లేదుకాబోలు. అలా ఒక్కక్షణం ఆలోచించేసరికి ప్రభ హృదయం కంపించింది. ఆమె తలపులో గతం కదలాడింది.

ఎంతో సున్నితమైన అలేత మనస్సు ఇట్టే గాయపడింది. శరీ రానికి సూది మొనతో చిన్నగాయం తగిలినా రక్తం స్రవించినట్లు, మనసుకు తగిలిన ఆ చిన్న దెబ్బ దీప కళ్లలో నీటిని ధారలు కట్టి స్తోంది. మంచంమీద వాలిపోయి తలగడలో ముఖం దాచుకుంది. తను ఈ రోజు సినిమాకు వెళ్లలేకపోతున్నందుకు కాదు, దీప బాధ పడుతున్నది. అన్నా వదినలతో సరదాగా ఎక్కడికైనా వెళ్లాలని, వదిన వచ్చినప్పటినుంచీ అనుకుంది దీప. ఆ విషయం ఆనందంగా తన స్నేహితురాళ్లతో చెప్పొచ్చు. "మా వదిన ఎంతమంచిదో ఎక్క డికి వెళ్ళినా నన్నుకూడా తీసుకువెళుతుంది" అని తోటివాళ్లతో సగ ర్వంగా చెప్పుకోవడంలో ఎంత సంతోషం....అనుకుంటూ ఆ రోజు కోసం ఇప్పటి వరకూ ఎదురు చూసింది. కానీ... వదిన మనసులో దీప ఊహిస్తున్న భావనలేదని వెల్లడైపోయినందుకే, దీపకు దుఃఖం వస్తోంది. గతం అంతా నెమరేస్తున్న ప్రభ పశ్చాత్తప్తురాలైంది.

తనేనా....ఇప్పుడిలా ప్రవర్తిస్తున్నదీ! అన్పించింది. ఆ రోజులూ.... ఆ సంఘటనలూ అవేమళ్ళీ....మళ్ళీ....గుర్తురాసాగాయి. అవి... తను కన్నెపిల్లగా కలలలో ఊహలలోనూ తేలిపోతున్న రోజులు. ప్రపంచం అంతా రంగుల మయంగా కన్పించేది. సినిమాలకు వెళ్లాలని, షికార్లుచేయాలని ఇలా....ఎన్నెన్నో చిలిపికోరికలు. కానీ అప్పట్లో అవి తీరే అవకాశాలు అతిస్వల్పం. నాన్నపోయాక అమ్మ సినిమాలకు వెళ్లడం మానేసింది. అది తన చిన్నప్పుదే జరిగిపోవడం వల్ల మురిపెంగా అమ్మా నాన్నలతో సినిమాకు వెళ్లలేకపోయింది. స్నేహితులతో పంపడం అమ్మకసలు ఇష్టం ఉండేది కాదు. పోనీ అన్నయ్యతో సినిమాకి వెళదామంటే వాడు ఎప్పుడూ తన ఫ్రెండ్స్‌తోనే వెళ్లేవాడు. ఒక్కసారైనా తను వెళ్లాలని అమ్మని అడిగేది. "బాగుందే నీవరస, వాడూ వాడి స్నేహితులూ వెళుతూ ఉంటే నువ్వు వెంటపడితే ఏంబాగుంటుంది" అనేసేది. సరే ఇంక నేను సినిమాలు చూసినట్లే అని తను బంగమూతి పెట్టుకొని కూర్చుంటే.... "బాగుందే పిచ్చితల్లి రేపువాడి పెళ్ళైమీ వదిన రాదా ఏమిటి అప్పుడు అన్నావదినలతో కలిసి సరదాగా సినిమాలుచూడవచ్చు" అంటూ తన అలకతీర్చేది. ఇంకా రాని వదినకోసం ఎదురు చూస్తూ అన్నావదినలతో కలిసి తను ఎంతో సరదాగా సినిమాలకు షికార్లకు వెళుతున్నట్లు ముచ్చటైన ఊహల్లో విహరిస్తూ కాలంగడిపింది. తన ఊహలు నిజమయ్యేరోజు వచ్చేసరికి తన ఆనందానికి అంచులే లేవు. కానీ ఆ ఆనందం ఆవిరి అయిపోవడానికి ఎంతో సమయం పట్టలేదు.

అన్నా వదినా సినిమాకు వెళుతూ తనని నువ్వు వస్తావా అని అయినా అడగలేదు. తనెంత ముచ్చటపడుతున్నదీ అన్నయ్యకు తెల్సుకదా, సరదాగా సినిమాకు వెళదాం అని తను వదినతో ఒకటి

రెండుసార్లు అననూ అంది. అప్పుడు వదిన మౌనంవహిస్తే ఏమో అనుకుంది కానీ వాళ్లిద్దరూ సరదాగా సినిమాకో, షికారుకో వెళుతున్నప్పుడు తననూ తీసుకువెళ్లడం వదినకు ఇష్టంలేదని ఇప్పుడు తెలిసిపోయింది. అలా అన్నా వదినా వెళ్ళిపోయాక దిగాలుగా ఉన్న తనని చూసి అమ్మ అడిగింది "ఏమ్మాప్రభా అలా ఉన్నావేం?". ఆ మాటకు తన కన్నీటిప్రవాహానికి ఆనకట్ట తెగిపోయింది. ఏడుస్తూ అమ్మ ఒడిలో ముఖందాచుకుని అంది 'పో అమ్మా నువ్వు అన్నీ అబద్దాలే చెప్పావు. ఊరికేనన్ను ఊరించావు. నన్నువదిలేసి ఎంచక్కా అన్నా వదినా సినిమాకి వెళ్ళిపోయారు నాకు తెలిస్తే ఎక్కడ నేనూ వస్తానని అంటానో అని నాకు తెలియకుండా ఉండడానికి వదిన ఎంత ప్రయత్నించిందో ఉదయంనించి నన్ను తప్పించుకొని తిరిగిందో తెలుసా?" అమ్మ చెరగుతో తన కళ్ళుతుడిచి తల ప్రేమగా నిమురుతూ మాటల పనిలేకుండా తనను ఓదార్చింది. ఆనాడు తను ఎంత మానసిక వ్యధకు గురిఅయ్యిందో మరి ఈ రోజు తనఆడబిడ్డ మానసిక స్థితికూడా అంతేకాదా? తనలాగే దీపకూడా అన్నావదినలతో సరదాగా సినిమాలకు, షికార్లకు వెళ్లాలని కలలు గని ఉండదా. తనెంత పొరపాటు చేసింది. దీప మనస్సును ఎంత బాధ పెట్టింది అనుకుంటూ దీప పడుకున్న గదిలోకి వెళ్ళింది.

దీపను లేవదీసి "ఏడుస్తున్నావా పిచ్చిపిల్లా ముఖం కడుక్కో మీ అన్నయ్య వచ్చేవేళైంది. మనం సినిమాకు వెళదాం" అంది.

అకస్మాత్తుగా వదిన అలా అనేసరికి దీప బిగుసుకుపోయింది ఆమెలోని అభిమానం తలఎత్తింది. దిగ్గునలేచి కళ్లుగట్టిగాతుడిచేసుకుంది. నేనేం ఏడవడంలేదు. మీరు వెళ్లండి సినిమాకు నేను రాను" అంది బింకంగా. అదేమిటి దీపా సరదాగా మనంకలిసేవెళదాం."

నువ్వు ఇప్పుడలా అనేస్తే నాకు బాధగా ఉండదా." బాధ ఎందుకులే నీ సానుభూతి అంతా నేను ఏడుస్తున్నాననేగా. నేనేం ఏడవనులే. మీ ఇద్దరూ సరదాగా వెళ్లండి మధ్య నేనెందుకు".

ఆ మాట ప్రభ హృదయానికి చురకలా తగిలింది. "నువ్వు నన్ను పొరపాటుగా అర్థం చేసుకుంటున్నావు దీపా. మన మధ్య ఎలాంటి పొరపచ్చాలు ఉండకూడదు. ఉన్నా సర్దుకుపోవాలి." ఇలా ఎంతగానో నచ్చచెప్పి ఆడపడుచుని తయారు చేసింది.

హుషారుగా ఆఫీసు నుంచి వచ్చిన రఘు తన చెల్లెలు కూడా భార్యతోపాటు తయారై ఉండడం చూసి నీరసపడ్డాడు. ప్రభలోపలి నుండి కాఫీ టిఫిన్‌తో తిరిగివచ్చింది. వాటిని అందుకో కుండానే చెల్లెమ్మా కొంచం మంచినీళ్లుతీసుకురా" అని చెప్పి దీప వెళ్ళిపోగానే నెమ్మదిగా "అదేమిటి ప్రభా దీపకూడా మనతో సినిమాకేనా చంపేశావు. ముచ్చటగా ఏదో మనిద్దరం వెళదాం అని నేను అను కుంటే అదికూడా ఎందుకు మన మధ్య"అన్నాడు.

"ఆ మాట ఏమిటండి దీప మనమధ్య ఉంటే మాత్రం మన ముచ్చటకిలోటేమిటి? మనం ముగ్గురం కలిసి వెళ్లడంలోనే నాకు ఆనందం. అదే మనముచ్చట. మనం ఎప్పుడు ఎక్కడికివెళ్ళినా, నా చిన్నారి ఆడబిడ్డకి పెళ్లయి అత్తవారింటికి వెళ్లేదాకా మనతోఉండ వల్సిందే" భార్యమాటలతో రఘు పొరపాటును గ్రహించాడు.

ఆడపడుచుమీద ప్రభకు ఉన్న అభిమానం, అనురాగం అతనికి ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. తన వారిపైన భార్యకుఉన్న మనసు-మమత ఆమెపై మరింత ప్రేమకలిగించింది రఘు హృదయంలో.

అన్నా వదినలతో ఎంతో ముచ్చటగా సినిమాకు వెళుతున్న దీపను చూసి మురిసిపోయింది కాంతమ్మ మాతృహృదయం. ●